క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి చేయూత



ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్ అందిస్తున్న మిత్రులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన దాసరి శివాజీ ఏడాది క్రితం కరంటుషాక్‌కు గురై మరణించాడు. మృతుడి స్నేహితులు సమకూర్చిన రూ.45వేలు శివాజీ కూతురు పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బుధవారం బాండ్‌ను కుటుంబీకులకు అందించారు. మండలంలోని అప్పన్నపేట, బ్రాహ్మణపల్లి గ్రామాలకు చెందిన మిత్రులు ఉన్నారు.

బోనాల వేడుక



బోనాలతో మహిళలు

రామగిరి: సెంటనరీకాలనీ జోన్‌-1 శ్రీదుర్గా గాయత్రి సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో జోన్‌-1లోని మైసమ్మ ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. సేవాసమితి సభ్యులు పాండు, కుమారస్వామి, వెంకటేశ్, ప్రేమ్‌కుమార్, అజయ్, సందీప్, శ్రీకాంత్, రాకేశ్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



నగదు అందజేస్తున్న ఫౌండర్ వెంకటస్వామి

కమాన్‌పూర్: మండల కేంద్రంతో పాటు శాలపల్లికు చెందిన పలువురు బాధిత కుటుంబాలకు సుందరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫౌండర్ బోనాల వెంకటస్వామి ఆర్థికసాయం అందజేశారు. బాపూజీనగర్‌కు చెందిన కామెర లక్ష్మయ్యకు రూ.7వేలు, రోడ్డు ప్రమాదంలో గాయపడిన మార్త సుధాకర్‌కు రూ.2వేలు, 25 కిలోల బియ్యం, సజ్జనపు రాజనందం ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి 25కిలోల బియ్యం అందజేశారు. కన్నూరి నగేష్, టెక్కం కుమార్, రాధారపు వెంకటేశ్, ఎదురుగట్టు సతీశ్, బోయిని సంతోష్, కామెర శంకర్, సది, సుధాకర్ పాల్గొన్నారు.

గాండ్ల తిలకులకు అండగా ఉంటాం



నూతన కార్యవర్గంతో నాయకులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గాండ్ల తిలకులకు అండగా ఉంటూ ఐక్యతకు పాటుపడతామని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన సంగెం వెంకట్రాజం, చంద సతీశ్ అన్నారు. పెద్దపల్లిలో బుధవారం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన సత్యనారాయణ, రమేశ్, మారుతి, సత్తయ్య, రాజేంద్ర కార్యవర్గంతో ప్రమాణం చేయించారు. గాండ్ల తిలకులకు స్వయం ఉపాధి కోసం రుణాలను సాధించడంతో పాటు దేశవాళీ వంట నూనెల సాగుకు ప్రోత్సాహం అందించేలా ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. సమావేశంలో సత్యనారాయణ, మధుబాబు, రాజమల్లు, మహేందర్, మల్లేశం, లక్ష్మి ఉన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ పొందిన రత్నయ్యకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా ఎల్టా సభ్యుల బృందంతో పాటు పాఠశాలల పూర్వ మిత్రులు, గ్రామస్తులు, విద్యార్థులు సన్మానించారు. హెచ్‌ఎం శోభారాణి, టీచర్లు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా సురేశ్

కమాన్‌పూర్: మండల ఇన్‌చార్జి ఎంపీడీగా సురేశ్‌ను నియమిస్తూ జెడ్పీ సీఈవో నరేందర్ బుధవారం ఉత్తర్వులు అందజేశారు. సురేశ్ ప్రస్తుతం మండల పర్యవేక్షణ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష
- మంథనిలో ఆకస్మిక పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

మంథని: ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. మంథని మండలంలో బుధవారం కలెక్టర్ ఆకస్మిక పర్యటన చేశారు. మండలంలోని వెంకటాపూర్, అడవి సోమనపల్లి గ్రామాల్లోని ఇసుక రీచ్‌లను, మంథనిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని, పురపాలక, పీఆర్, కార్యాలయాలు, ఐబీ అతిథి గృహాన్ని పరిశీలించారు. ఇసుక రీచ్‌ల వద్ద కట్టిన ట్రెంచ్‌లను పరిశీలించి ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని, మంథని తహసీల్దార్ కార్యాలయం ఆధునీకరణకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మున్సిపాలిటీలో నూతనంగా ప్రతిపాదించిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు.

పాఠశాలలో నీరు నిల్వకుండా చర్యలు

వర్షాకాలం నేపథ్యంలో పాఠశాల మైదానాల్లో నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. మంథని మండలం ఖాన్‌సాయిపేట, ఆరెంద, అడవి సోమన్‌పల్లి పాఠశాలలు, వెంకటాపూర్‌లోని జ్యోతిరావుపూలే రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలల్లోని తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల కనీస విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. ఆరెంద జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల సమీపంలో కూలిపోయే స్థితిలో ఉన్న ప్రాథమిక పాఠశాల పాత భవనాన్ని పూర్తిస్థాయిలో తొలగించాలని ఆదేశించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాదేవి, మంథని రెవెన్యూ డివిజన్ అధికారి వి.హనుమాన్‌నాయక్, తహసీల్దార్ రాజయ్య, కమిషనర్ మల్లికార్జునస్వామి, ఎంపీడీవో పూర్ణచందర్‌రావు, పీఆర్ డిప్యూటీ ఇంజనీర్ కె.నవీన్, అసిస్టెంట్ ఇంజనీర్ అనుదీప్ తదితరులు ఉన్నారు.

పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

ముత్తారం: మండలంలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలు పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. ముత్తారం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో పేరుకుపోయిన భూ సమస్యలు, ధరణి, భూసేకరణ సమస్యలపై స్థానిక అధికారులతో రివ్యూ నిర్వహించారు. మీసేవా కేంద్రాల ద్వారా వస్తున్న సర్టిఫికెట్లను త్వరగా పరిశీలించి జారీ చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయం ఆవరణలో ఆయన మొక్కలు నాటారు. తహసీల్దార్ సుమన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగ విరమణ ఎస్సైలకు సన్మానం



రిటైర్డ్ అధికారులతో సీపీ శ్రీనివాస్

గోదావరిఖని: ఉద్యోగ విరమణ పొందిన కుటుంబాలకు అండగా పోలీస్‌శాఖ నిలుస్తుందని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ హామీ ఇచ్చారు. పోలీస్‌శాఖలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ముగ్గురు ఎస్సైలు ఎం.రాజేంద్రప్రసాద్, దత్తుప్రసాద్‌శర్మ, అబ్దుల్ సత్తార్‌ను సీపీ సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. అదనపు డీసీపీ అడ్మిన్ సి.రాజు, గోదావరిఖని ఏసీపీ రమేశ్, పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు పోచలింగం, రిటైర్డ్ అధికారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కుంటకు గండిపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న మత్స్యకార్మికులు

ఓదెల: ఓదెల గ్రామంలోని మల్లన్నకుంటకు గుర్తుతెలియని వ్యక్తులు గండి పెట్టారు. ఓదెల గ్రామానికి చెందిన 100మంది మత్స్యకార్మికులు నీళ్లన్నీ వృథాగా పోయాయని బుధవారం తహసీల్దార్ యాకయ్యకు విన్నవించారు. కుంటకు గండిపెట్టిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మత్స్యకార్మికులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గండిపెట్టడంతో మల్లన్న కుంటలో పోసిన 50వేల చేపపిల్లలు కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఓదెల తహసీల్దార్, ఇరిగేషన్ శాఖలో వినతిపత్రం అందజేశారు. మత్స్యకార్మికులు మంద కొమురయ్య, పిట్టల రాంచంద్రం, నర్సింగ్, తూడి సురేశ్, తూడి రాజయ్య, స్వామి, శంకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గని ప్రమాద కార్మికులకు పరామర్శ



పరామర్శిస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: సింగరేణి జీడీకే–2గనిలో జరిగిన ప్రమాదంలో గాయపడిన కార్మికులను బుధవారం ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు సంపత్‌కుమార్, శంకర్, నోయల్‌తో మాట్లాడారు. త్వరలో కోలుకోవాలని, ధైర్యంగా ఉండాలని కోరారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కలిసి కోరారు.

ఉద్యోగికి విరమణ తప్పనిసరి



సన్మానిస్తున్న డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్

మంథని: ప్రతీ ఉద్యోగికి విరమణ తప్పనిసరని మంథని ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. మంథని ఆర్టీసీ బస్సు డిపోలో అసిస్టెంట్ డిపో క్లర్క్‌గా పనిచేస్తున్న ముద్దసాని లక్ష్మీనారాయణ ఉద్యోగ విరమణ పొందగా బుధవారం సత్కరించారు. అసిస్టెంట్ మేనేజర్ ఏంజల్, సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్ ఉన్నారు.

కార్మిక కుటుంబాలను వైద్యానికి దూరం చేయొద్దు

గోదావరిఖని: కార్మిక కుటుంబాలను వైద్యానికి దూరం చేయొద్దని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బెల్లంపల్లిలో సింగరేణి ఆసుపత్రి మూసివేయడం సరికాదన్నారు. అక్కడే నివాసముంటున్న రిటైర్డ్ కార్మికులు వైద్యంకోసం ఎక్కడి వెళ్లాలని ప్రశ్నించారు. బెల్లంపల్లి అఖిలపక్షం చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందన్నారు. నాయకులు కొమురయ్య, దుర్గయ్య, బాబు, మొండయ్య, జనార్దన్, రవికుమార్, రాజన్న, మల్లేశం పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నిగమా ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపల్ పరిధిలోని పూసాలకు చెందిన రాజు, రాజేశ్ బైక్‌పై సుల్తానాబాద్‌కు వస్తుండగా కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న కారు వెనక నుంచి ఢీకొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై పేర్కొన్నారు.

బొలెరో డ్రైవర్‌కు..

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి శివారులోని పశువుల సంత సమీపంలోని రాజీవ్ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలెరో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై శ్రావణ్‌కుమార్ వివరాల ప్రకారం నర్సంపేట, చల్లాపర్తికి చెందిన కంటమల్ల గణేశ్ తన బొలెరో వాహనంలో పెద్దపల్లి వైపునకు వెళ్తుండగా గర్రెపల్లి వద్ద వాహనం దిగి మూత్రవిసర్జన చేసేందుకు దిగగా హైడ్రాలిక్ క్రేన్ డ్రైవర్ ఢీకొనడంతో బొలెరో డ్రైవర్‌కు తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన దండు లక్ష్మి, కట్ట సాహితి ఇటీవల మృతి చెందారు. కాగా బుధవారం వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు.

పాఠశాల ప్రాంగణంలో నీటి తొలగింపు

మంథని: మంథని మండలం కన్నాల పంచాయతీ పరిధిలోని వేంపాడులో మూతపడిన ప్రాథమిక పాఠశాల చుట్టూ చేరిన వర్షపు నీటిని బుధవారం తొలగించారు.

ఆర్థికసాయం

మంథని: మున్సిపల్ పరిధిలోని ఏడో వార్డు ఉస్మాన్‌పుర కాలనీలో వర్షానికి ఇల్లు కూలిపోయిన బాధితురాలు షైనాజ్‌కు మున్సిపల్ వైస్ చైర్మన్ సీపతి బానయ్య ఆధ్వర్యంలో కౌన్సిలర్ల బృందం సందర్శించింది. కూలిన ఇంటిని పరిశీలించి ప్రభుత్వ ఆర్థిక సాయం కోసం స్థానిక తహసీల్దార్ రాజయ్య దృష్టికి తీసుకెళ్లారు. తక్షణ సాయం కింద మున్సిపల్ వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు రూ.5వేలు అందించారు. కౌన్సిలర్లు వీకే, రవి, కొట్టె పద్మ, వేముల లక్ష్మి, నక్క నాగేంద్ర, మాజీ వార్డుసభ్యుడు ఇనుముల సతీశ్ ఉన్నారు.

హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ కోరారు. జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అధికారికి బుధవారం వినతిపత్రం అందించారు. నాయకులు సిద్దార్థ, రోషన్, శశిధర్, రాహుల్, యశ్వంత్ ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్‌కోట్ల పంపిణీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ పంచాయతీలో పారిశుద్ధ కార్మికులుగా పనిచేస్తున్న వారికి బుధవారం డీఎల్‌పీవో వేణుగోపాల్ రెయిన్‌కోట్లు అందించారు. ఎంపీవో ఫయాజ్‌అలీ, కార్యదర్శి తూముల రవి ఉన్నారు.

తప్పుడు ఫిర్యాదులు చేయడం మానుకోవాలి

జ్యోతినగర్: మద్యం సేవించానని ఎన్టీపీసీ హెచ్ఆర్ అధికారి తనపై ఎన్టీపీసీ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు ఇచ్చారని ఎన్టీపీసీ ఉద్యోగి కె.శ్రీపతిరావు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. వేధింపులు తట్టుకోలేక నిద్రమాత్రలు మింగానని, మద్యం సేవించినట్లుగా ఫిర్యాదు చేయడం సరికాదన్నారు. మద్యం సేవించినట్లు ఉంటే బ్రీత్ అనలైజర్‌తో పరీక్షలు ఎందుకు నిర్వహించలేదన్నారు.

సేవాకోర్సుల ఫ్యాకల్టీకి ఇంటర్వ్యూ

గోదావరిఖని: 2024–25 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి సేవాసమితి ఆర్జీ–2 ఆధ్వర్యంలో నిర్వహించే సేవాకోర్సులు నేర్పించేందుకు ఫ్యాకల్టీ కోసం బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 23 మంది ఫ్యాకల్టీ సభ్యులు హాజరయ్యారు. ఎస్‌వోటూ జీఎం వెంకటేశ్వర్‌రావు, అధికారులు మురళీకృష్ణ, వెంకటరామచంద్ర, రాజేంద్రప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సిరికి నీడ స్వచ్ఛంద సంస్థ సాయం

గోదావరిఖనిటౌన్: ఎన్టీపీసీ జంగాలపల్లికి చెందిన ఇంటర్ టాపర్ సిరి ఆటో ఇమ్యూన్ వ్యాధితో రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్‌తో బాధపడుతోంది. ఆమె చికిత్స ఖర్చుల నిమిత్తం నీడ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు పల్లెర్ల రమేశ్‌గౌడ్ 'మన 100 రూపాయలు సమాజం కోసం' గ్రూప్ నుంచి రూ.5వేలు బాధితురాలికి అందజేశారు.

గ్రామ సమస్యలు పరిష్కరించండి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని లింగాపూర్‌లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని బుధవారం పంచాయతీ కార్యదర్శి పెనుగొండ రాజ్యలక్ష్మికి గ్రామ సామాజిక కార్యకర్త నిమ్మరాజుల రవి వినతిపత్రం అందజేశారు.

ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ కోరారు. పలు వార్డుల్లోని మురుగునీటి నిల్వల్లో బుధవారం ఆయిల్ బాల్స్ వేయించారు. పిచ్చిమొక్కలను ట్రాక్టర్ ద్వారా తొలగించారు. మేనేజర్ అలీమొద్దీన్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

దాడికి గురైన ప్రభుత్వ వైద్యుడికి పరామర్శ

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ పీహెచ్‌సీలో విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ మహేందర్‌పై దాడి చేసిన ఘటనపై ప్రజలు, ప్రజాప్రతినిధులు, డాక్టర్స్ అసోసియేషన్ ఖండించారు. కాల్వశ్రీరాంపూర్ మాజీ జెడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి బుధవారం కరీంనగర్ ఆసుపత్రికి వెళ్లి డాక్టర్‌ను పరామర్శించారు. డాక్టర్ అసోసియేషన్‌కు చెందిన పలువురు నాయకులు పరామర్శించారు.

తొలగిన బురదరోడ్డు ఇబ్బందులు

పెద్దపల్లిరూరల్: మండలంలోని చీకురాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బురద రోడ్డుపై సర్కస్ ఫీట్లు చేస్తూ పాఠశాలకు చేరుకునే ఇబ్బందులను అధికారులు దూరం చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో సురేంద్రకుమార్, మాజీ జెడ్పీటీసీ రామ్మూర్తి బుధవారం బురదను చదును చేయించి డస్ట్ పోయించారు. రెండురోజుల క్రితం బీఆర్‌ఎస్ నాయకురాలు దాసరి ఉష రోడ్డును పరిశీలించి విద్యార్థుల ఇబ్బందులు దూరం చేసేందుకు వీలుగా రోడ్డుకు డస్ట్ పోయించాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే.

నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన

పాలకుర్తి: మండల పరిధిలోని కన్నాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష విద్యా విషయక సమన్వయకర్త డాక్టర్ పీఎం షేక్ టీచర్లకు పలు సూచనలు చేశారు.

జూలపల్లిలో..

జూలపల్లి: మండలంలో కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలతో పాటు తేలుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు బుధవారం జాతీయ సాధన సర్వే–2024పై రెండు రోజుల శిక్షణను ఏఎంవో షేక్ ప్రారంభించారు.

డ్రగ్స్ సరఫరా, వినియోగం చట్టరీత్యా నేరం



వాహన పత్రాలను పరిశీలిస్తున్న సీఐ కృష్ణ

పాలకుర్తి: మత్తు పదార్థాల సరఫరా, వినియోగం చట్టరీత్యా నేరమని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలుంటాయని పెద్దపల్లి సీఐ కృష్ణ అన్నారు. బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో బుధవారం కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా సోదాలు నిర్వహించి సరైన పత్రాలు లేని 38బైక్‌లను సీజ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, సైబర్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బసంత్‌నగర్, ధర్మారం ఎస్సైలు స్వామి, లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు అందని ద్రాక్షగా ప్రభుత్వ వైద్యం



మాట్లాడుతున్న దాసరి ఉష

సుల్తానాబాద్: ప్రభుత్వ వైద్యం అందక విషజ్వరాలతో సంభవిస్తున్న మరణాలు ప్రభుత్వ హత్యలేనని, ప్రభుత్వ వైద్యం నిరుపేదలకు అందని ద్రాక్షగా మారిందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు దాసరి ఉష ఆరోపించారు. సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రిలో ఉన్న రోగులను బుధవారం ఆమె పరామర్శించారు. అనంతరం డాక్టర్ రమాదేవితో చర్చించారు. 30 పడకల ఆసుపత్రి సౌకర్యాలు ఉన్నప్పటికీ సిఫార్సు చేసి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి బడ్జెట్ పెంచాల్సింది పోయి తక్కువ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గందె మల్లికార్జున్, యూత్ అధ్యక్షుడు ఎండీ వాహిద్, చిన్నకల్వల మాజీ ఎంపీటీసీ గుర్రం సంపత్‌గౌడ్, యూత్ నాయకులు ఆరెపల్లి ప్రశాంత్, గోస్కుల కుమార్, కల్వల రాజు, అర్జున్, శ్రావణ్, సాగర్ ఉన్నారు.

ప్రైవేట్ వ్యక్తులకు తొత్తుగా మారిన కేంద్రం



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

గోదావరిఖని: కేంద్రం కొత్తగా కోల్‌మైన్స్ ల్యాండ్ యూజ్ పాలసీని రద్దు చేసి పార్లమెంట్‌లో ప్రైవేట్ వ్యక్తులకు తొత్తుగా కొత్త చట్టం చేసిందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం మేలుకొని అసెంబ్లీలో ల్యాండ్ యూజ్ పాలసీ రద్దు చట్టానికి వ్యతిరేకంగా బిల్లు చేసి కేంద్రానికి పంపాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు రాజారావు, మంద నరసింహారావు, యాకయ్య, ముత్యంరావు, మహేశ్వరి, కుమారస్వామి, మెండె శ్రీనివాస్, ఎస్.బిక్షపతి, నారాయణ, ఆశయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నాకు తరలుతున్న మధ్యాహ్న భోజనవర్కర్లు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందిస్తున్న వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని జిల్లా వర్కర్ల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పూసాల రమేశ్ కోరారు. మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునేందుకు చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని భగ్నం చేసేందుకు పోలీసులు ఎక్కడికక్కడే నిర్బంధించడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. మధ్యాహ్నభోజనం అందించే బాధ్యతలను స్వచ్ఛంద సంస్థలకు అందించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని విరమించుకుని వర్కర్లకు ప్రతినెలా వేతనం, గౌరవ వేతనం ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు రవీందర్, పావని ఉన్నారు.

కార్మికుల ముందస్తు అరెస్టు

కమాన్‌పూర్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, ఆటో డ్రైవర్లను కమాన్‌పూర్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు చేపట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్టులా?

సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్: హక్కుల కోసం ప్రశ్నిస్తే అరెస్టు చేయడం రాజ్యాంగ విరుద్ధమని సీపీఐ కార్యదర్శి సదానందం ఆరోపించారు. కార్మికుల సమస్యలు పరిశీలించాలని విన్నవించుకునేందుకు హైదారాబాద్‌కు వెళ్లేవారిని సుల్తానాబాద్ పోలీసులు బుధవారం ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్మికులకు సంఘీభావం తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం చేసినట్లుగానే ఈ ప్రభుత్వం చేస్తోందని విమర్శించారు. అరెస్టు అయిన వారిలో సీఐటీయూ, జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్, శ్రీకాంత్, లీలావతి, లావణ్య ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు.

అక్రమ అరెస్టులను ఖండించాలి

రామగుండం: కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఎండగట్టేందుకు పీడీఎస్‌యూ, పీవైఎల్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. కాగా పోలీసులు ముందస్తుగా పలువురు నాయకులను అరెస్టు చేయడంపై ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ వైఖరిపై మండిపడ్డారు. ఛలో అసెంబ్లీని పోలీసులు భగ్నం చేయడం, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు బొంతు ఆనంద్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంపై ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు.

విద్యతో విజ్ఞానం

జ్యోతినగర్: విద్యతో విజ్ఞానాన్ని పొందవచ్చని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బుధవారం విద్యార్థులకు కేబినెట్ ఎన్నికలు–బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్టీపీసీ ఏజీఎం బిజయ్‌కుమార్ సిగ్దర్, ప్రవీణ్‌కుమార్, ఆదేశ్‌పాండే, వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్, హెచ్‌ఎం ఆరస్ జ్యోతి పాల్గొన్నారు.

నియామకం



పుష్పలత

కమాన్‌పూర్: తెలంగాణ కళావేదిక మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని పేంచికల్‌పేటకు చెందిన దబ్బెట పుష్పలతను నియమించినట్లు కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు నకిరేకంటి కిరణ్‌కుమార్ తెలిపారు.

కస్తూర్బాలో కాంట్రాక్టు ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి: కస్తూర్బా బాలికల పాఠశాలలో కాంట్రాక్టు ప్రాతిపాదికన రెండు అసిస్టెంట్ కుక్‌లు, రెండు స్వీపర్ పోస్టులకు స్థానిక మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ మంజుశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల అభ్యర్థులు జూలై 31 నుంచి ఆగస్టు 2 వరకు రామగిరి కస్తూర్బా పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈ పోస్టులకు పదో తరగతి మెమో, ఏడో తరగతి మెమో, స్టడీ సర్టిఫికెట్స్, కులం సర్టిఫికెట్, ఆధార్ జిరాక్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అసిస్టెంట్ కుక్‌లకు ఒకటి జనరల్ కేటగిరీ, ఒకటి బీసీ–ఏ కేటగిరీ వారు దరఖాస్తు చేసుకోవాలని, 25 నుంచి 55ఏళ్ల వయస్సు కలిగి ఉండాలని, పదో తరగతి ఉత్తీర్ణులై స్థానిక మహిళలై ఉండాలని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా స్వీపర్ వెట్, డ్రై పోస్టులు జనరల్ కేటగిరీ వారు దరఖాస్తు చేసుకోవాలని, 18 నుంచి 35ఏళ్ల వయసు లోపు ఉండి 7వ తరగతి పాసై రామగిరి మండల స్థానిక మహిళలై ఉండాలని వివరించారు.

వాహనాల తనిఖీ

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఫోర్‌లైన్ రహదారిపై బుధవారం స్థానిక పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్సై స్వామితో పాటు పోలీస్‌సిబ్బంది సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు.